


# కరపత్రం

SINCE 2014

సోమవారం జూన్ 29, 2026 సంపుటి : 2 సంచిక : 257 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




## కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు : సీఎం రేవంత్‌రెడ్డి

### తెలంగాణ త్యాగాలను బీఆర్ఎస్ తమ ఖాతాలో వేసుకుందన్నారు

- పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం అందిస్తున్నామన్న సీఎం
- 30 నెలల్లో రూ.1.56 లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడి
- 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు
- కులగణనలో తెలంగాణ దేశానికే ఆదర్శం అన్నారు
- ఎవరు అడ్డుకున్నా మూసీ ప్రక్షాళన ఆగదు అని స్పష్టం
- కాళేశ్వరం వైఫల్యంపై బీఆర్ఎస్‌కు సవాల్
- ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులు ఎన్నికలలోపు పూర్తి చేస్తాం అని హామీ



పదేళ్లు పదవులు అనుభవించి రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంతోమంది త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధిస్తే.. పదవులు మాత్రం కేసీఆర్ కుటుంబం అనుభవించిందని విమర్శించారు. ఆ కుటుంబానికి మళ్లీ అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. నల్గొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నాగార్జున కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.

**బీఆర్ఎస్ హయాంలో పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదు**

"గ్రామగ్రామాన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుంటే బీఆర్ఎస్ వాళ్లకు కడుపు మండుతోంది. పదేళ్లపాటు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు కానీ.. పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదు. ఏటా రూ.16వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. 30 నెలల్లోనే రైతుల ఖాతాల్లో రూ.1.56లక్షల కోట్లు జమ చేశాం. యూరియా సరఫరాలో కేంద్రం సహకరించకపోయినా కష్టపడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ ఇవాళ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నాం. 30 నెలల్లోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి చరిత్ర సృష్టించాం. దేశంలో గతంలో ఎన్నడూ జరగని కులగణనను రాష్ట్రంలో చేపట్టాం. మా ఒత్తిడితోనే కేంద్రం కూడా జనగణనతో కులగణన చేస్తామని చెప్పింది.

**మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి కోమటిరెడ్డి**

తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలిసిన అందరికీ నల్గొండ చరిత్ర తెలుసు. తొలిదశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవిని త్యాగం చేశారు. మలిదశ ఉద్యమంలో మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. నల్గొండ జిల్లా ప్రజలు గర్వించేలా ఆయన దీక్ష కూడా చేశారు.



## ఎన్ని నిధులైనా ఇస్తాం..

### SLBC,డిండి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- నల్లగొండ సాగునీటి ప్రాజెక్టులకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- BRS నిర్లక్ష్యంతో ప్రాజెక్టులు నిలిచిపోయాయి అని విమర్శ
- రూ.13 వేల కోట్లతో రోడ్ల అభివృద్ధి చేపడుతున్నాం
- మహిళలకు రూ.1 లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు లక్ష్యం
- రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- నల్లగొండ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తుంది
- ప్రజల కలలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు

నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా... కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా... ఎన్జీ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎస్ ఎల్ బీసీ , డిండి, నక్కల గండి ప్రాజెక్టులు నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష అని గుర్తు చేసిన ఆయన... గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం తన అహంకారంతోనే ఈ ప్రాజెక్టులను పక్కనబెట్టి, జిల్లా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎంత బడ్జెట్ అయినా సరే కేటాయించి... ఈ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి తీరుతుందన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రోడ్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నామని... హ్యామ్ మోడ్ ద్వారా ఏకంగా రూ. 13 వేల కోట్లతో రోడ్లను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కేవలం రోడ్లే కాదు... రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని కోటీశ్వరులను చేయాలన్నదే ఇందిరమ్మ రాజ్యం ధ్యేయమన్నారు. ఇందులో భాగంగానే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని... రాబోయే ఐదేళ్లలో ఏకంగా ఒక లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించి తీరుతామని సంచలన ప్రకటన చేశారు.

ఇక ఇండ్లు లేని నిరుపేదల సొంతింటి కల నిజం చేసేందుకు రూ. 22,500 కోట్ల భారీ నిధులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా నల్లగొండ, ఖమ్మం జిల్లాలు కాంగ్రెస్ పార్టీకి కంటికి రెప్పలా అండగా నిలిచాయని... ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఈ ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

## రేవంత్ ఫెయిల్యూర్ సీఎం

- » "గుప్పు మేస్త్రీ కాదు.. ముంపు మేస్త్రీ" అంటూ ఎద్దేవా
- » మూడు విడతల రైతు బంధు ఎగ్గొట్టారని ఆరోపణ
- » రైతు బంధుపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా? అని సవాల్
- » ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- » రైతులు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు అని వ్యాఖ్య
- » ఎస్ఎల్‌బీసీ పనుల్లో నిర్లక్ష్యం వల్ల ప్రాణనష్టం జరిగిందని ఆరోపణ

**సిద్ధిపేట:**

సీఎం రేవంత్‌రెడ్డి గుప్పు మేస్త్రీ కాదు.. ముంపు మేస్త్రీ అని మాజీ మంత్రి హరీష్ రావు ఎద్దేవా చేశారు. సిద్ధపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిన దద్దమ్మ ముఖ్యమంత్రి, ఫెయిల్యూర్ సీఎం రేవంత్.

రైతు బంధ మీద శాసన సభలో చర్చకు రేవంత్‌రెడ్డి సిద్ధమా?. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మా ప్రభుత్వంలో 92 లక్షల మెట్రిక్ టన్నున ధాన్యం కొన్నాం. 80 లక్షల మెట్రిక్ టన్నుల



ధాన్యం కొన్నామని రేవంత్ చెప్పుకోవడం విచిత్రం. ఈ రోజు ప్రతి రైతు కేసీఆర్‌ను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తలచుకుంటున్నారు. బీఆర్ఎస్ ఎస్ఎల్‌బీసీ టన్నెల్స్‌ను 12 కిలోమీటర్లు తవ్వింది. ఎస్ఎల్‌బీసీలో కార్మికులు చనిపోతే శవాలను కూడా బయటకు తీయలేకపోయారని విమర్శించారు.

## వారి ఓట్లు తొలిగించాల్సిందే.. కిషన్ రెడ్డి



**హైదరాబాద్:**

సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యోగులపై నమ్మకం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. (ఆదివారం) ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. బీఎల్వోలుగా ఉన్నది తెలంగాణ ఉద్యోగుల కాదా అని ప్రశ్నించారు? పాతబస్తీలో, బంగ్లాదేశ్, మయన్మార్, దేశాల ప్రజలున్నారని వారంతా భారతీయులు కాదన్నారు. అటువంటి వారిని ఓటర్ లిస్టులో ఎట్టిపరిస్థితుల్లో ఓటర్ లిస్టులో ఉంచేది లేదన్నారు. తెలంగాణలో ఖచ్చితంగా బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరముందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలేనని ప్రజలకు హామీలిచ్చి పచ్చిమోసం చేశాయని మండిపడ్డారు.




### ఘనంగా పీవీ నరసింహారావు

## జయంతి వేడుకలు

**రెజిమెంటల్ బజార్:**

భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని పీవీ జ్ఞానభూమి (పీవీ ఘాట్) వద్ద ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పీవీ సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## మద్యం అమ్మిన ఆరుగురి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగించిన సర్పంచ్




**చిల్పూర్:**

జనగామ జిల్లా చిల్పూర్ మండలంలోని నష్కల్‌లో మద్యం విక్రయించిన ఆరుగురి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. మద్యపాన రహిత గ్రామం కోసం గ్రామసభలో తీసుకున్న నిర్ణయం మేరకు చర్యలు తీసుకున్నట్టు సర్పంచ్ శాతబోయిన రాజు తెలిపారు. గ్రామంలో బెల్ట్ షాపులు ఉండటం వల్ల యువత ఆకర్షితులై చెడు అలవాట్లకు బానిసయ్యే ప్రమాదం ఉందని అక్కడి పెద్దలు పేర్కొన్నారు.




## పశ్చిమ బెంగాల్ స్ఫూర్తితో తెలంగాణలోనూ పోరాడాలి – నితిన్ నబీన్

**హైదరాబాద్:**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా తెలంగాణలోని పార్టీ శ్రేణులు పోరాడాలని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. ప్రజాపోరాటాలు చేయాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లా భాజపా కార్యాలయాలను నితిన్ నబీన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.




## బీఆర్ఎస్.. హెచ్ఆర్ఎస్ అవుతుంది: మంత్రి కోమటిరెడ్డి

**నల్గొండ:**

ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల మూసీ కష్టాలు త్వరలోనే తొలగుతాయని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మూసీ పునరుజ్జీవంతో జిల్లాలో కాలుష్యాన్ని తగ్గిస్తామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్, అంతకుముందు కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ జిల్లాకు నిధులు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు.




## దక్షిణాఫ్రికాలో ఘోర ప్రమాదం.. పైలట్ శిక్షణలో హనుమకొండ యువకుడు మృతి

దక్షిణాఫ్రికాలో జరిగిన విమాన ప్రమాదంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం కేంద్రానికి చెందిన యువకుడు ఆడెపు సుమంత్ మృతి చెందాడు. హసన్‌పర్తి మండలం సీతం పేట గ్రామానికి చెందిన ఆడెపు చంద్రమోహన్ వరలక్ష్మీ ప్రస్తుత్ హసన్ పర్తి మండల కేంద్రంలో స్థిర పడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు చిన్న కుమారుడు ఆడెపు సుమంత్ (22)దక్షిణాఫ్రికాలోని జొహన్నాస్‌బర్గ్‌లో గత సంవత్సరం పైలెట్ శిక్షణ పొందేందుకు వెళ్ళాడు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం జూన్ 29, 2026

## ఘనంగా పీవీ నరసింహారావు
# జయంతి వేడుకలు

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మహానేతగా పీవీ నరసింహారావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశానికి సమర్థవంతమైన నాయకత్వం అందించి భారత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపించిన దూరదృష్టి కలిగిన నాయకుడిగా ఆయన సేవలను కొనియాడారు. పీవీ నరసింహారావు ఆశయాలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చేసిన సేవలను దేశ ప్రజలు ఎప్పటికీ మరువలేరని నేతలు పేర్కొన్నారు. అనంతరం పీవీ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సీనియర్ రాజకీయ నాయకుడు కే. కేశవరావు (కేకే), భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, దైవజ్ఞ శర్మలు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి
వందల మంది త్యాగాలు చేసి తెలంగాణ సాధిస్తే దాన్ని బీఆర్ఎస్ నేతలు వాళ్ల ఖాతాలో వేసుకున్నారు. పెట్రోల్ పోసుకుని అగ్గిపెట్టె తెచ్చుకోని వాళ్లు త్యాగాలు చేసినట్లు చెప్పుకొంటున్నారు. పెట్రోల్ పోసుకుని ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి త్యాగాన్ని ఏమనాలి?

### ఎవరు అడ్డువచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదు
మూసీ కాలుష్యం తమ పాలిట విషంగా మారిందని నల్గొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారు. మూసీ నదిని శుద్ధి చేసి ప్రజలకు మేలు చేస్తామంటే దాన్ని కూడా పలువురు నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఎవరు అడ్డువచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదు. ఫాంహౌస్‌లో మెషిన్లు పెట్టుకుని భార్యాభర్తల ఫోన్లు కూడా దొంగచాటుగా విన్నారు. నిజాలు మాట్లాడే అలవాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఏనాడూ లేదు. ఆ పాపాల భైరవుడు మళ్లీ అధికారంలోకి రావాలని ఇద్దరు నేతలు తిరుగుతున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ పెడతాం. దానికి సిద్ధమా? రూ.లక్ష కోట్లతో కేసీఆర్, హరీశ్‌రావు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలి మూలన పడింది. వైఎస్ఆర్ చేపట్టిన ఎస్ఎల్‌బీసీని పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. వచ్చే ఎన్నికల్లోపు ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# పశ్చిమ బెంగాల్ స్ఫూర్తితో తెలంగాణలోనూ పోరాడాలి

మొదటి పేజీ తరువాయి
"ప్రజాసేవ, పోరాటాల ద్వారానే రాష్ట్రంలో అధికారంలోకి రాగలం. పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ప్రతి కార్యకర్త సంకల్పం తీసుకోవాలి. పశ్చిమ బెంగాల్‌లో కార్యకర్తల కృషితోనే భాజపా ఘన విజయం సాధించింది. అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ పోరాడాలి. త్వరలో ఈ రాష్ట్రంలోనూ కాషాయ జెండా ఎగరాలి. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుంది. లోక్‌సభలో రెండు సీట్లతో ప్రారంభమైన భాజపా.. ఇప్పుడు అప్రతిహతంగా సాగుతోంది. తెలంగాణ ఏర్పాటు కోసం సుష్మాస్వరాజ్ ఎంతో పోరాడారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న భాజపా వల్లే తెలంగాణ కల సాకారమైంది" అని నితిన్ నబీన్ అన్నారు.

## బీఆర్ఎస్.. హెచ్‌ఆర్ఎస్ అవుతుంది: మంత్రి కోమటిరెడ్డి

మొదటి పేజీ తరువాయి
ఇప్పుడిప్పుడే నిధులు వస్తున్నాయన్నారు. నల్గొండ జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన సందర్భంగా నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో కోమటిరెడ్డి మాట్లాడారు.
"హ్యామ్ రోడ్లకు టెండర్లు పిలవకముందే అవినీతి జరుగుతోందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. పూటకో పేరు మార్చుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తోంది. నిన్న టీఆర్ఎస్, ఇవాళ బీఆర్ఎస్.. రేపు హెచ్‌ఆర్ఎస్ అవుతుంది. హెచ్‌ఆర్ఎస్ అంటే హరీశ్‌రావు రాష్ట్ర సమితి. కేసీఆర్ పదేళ్లపాటు నల్గొండ జిల్లాను మోసం చేశారు. కుర్చీ వేసుకుని ప్రాజెక్టులు కట్టిస్తానన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదు. కేసీఆర్ పదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తోంది. రేషన్‌కార్డుపై సన్నబియ్యం ఇచ్చే ప్రభుత్వం మరొకటి లేదు. ప్రతి గ్రామంలో 30-40 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం. ఆయా ఇళ్లకు రూ.5లక్షల చొప్పున అందిస్తున్నాం. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 సీట్లనూ గెలుస్తాం" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# దక్షిణాఫ్రికాలో ఘోర ప్రమాదం.. పైలట్ శిక్షణలో హనుమకొండ యువకుడు మృతి

మొదటి పేజీ తరువాయి
అక్కడ పైలెట్ శిక్షణలో భాగంగా శిక్షణ విమానాన్ని నడుపుతున్న సమయంలో జూన్ 27 శనివారం సాయంత్రం విమాన ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమంత్ మరణించాడు.
చిన్నప్పటి నుంచే పైలెట్ కావాలనే లక్ష్యంతో కృషి చేసిన సుమంత్, ఉన్నత శిక్షణ కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతని ఆకస్మిక మరణించడంతో గ్రామంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి.
సౌతాఫ్రికాలో శిక్షణా విమానం కుప్పకూలడంతో తెలంగాణకు చెందిన యువకుడు మృతి చెందాడు. దీంతో తన స్వగ్రామం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం సీతంపేట గ్రామంలో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పరాయి దేశంలో ఉన్న తమ కుమారుడి మృతదేహాన్ని వెంటనే స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని, తగిన సహాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వేడుకుంటున్నారు.

## మద్యం అమ్మిన ఆరుగురి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగించిన సర్పంచ్

మొదటి పేజీ తరువాయి
యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మద్యపానాన్ని నియంత్రించాలని గతంలో గ్రామసభలో నిర్ణయించినట్లు తెలిపారు.
గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే రేషన్ కార్డు, కరెంటు, ఇతర సౌకర్యాలను నిలిపివేస్తామని సర్పంచ్ హెచ్చరించారు. మద్యం అమ్మేది లేదని బాండు రాసుకొస్తే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామన్నారు. గొప్ప చరిత్ర, ఆధ్యాత్మిక విలువలు ఉన్న గ్రామాన్ని పూర్తిగా మద్యపాన రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సర్పంచ్ శాతబోయిన రాజు సారథ్యంలో పెద్దలు ఈ నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు ప్రజలతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బెల్ట్ షాపులు నిర్వహించకుండా ప్రత్యేక తీర్మానం చేశారు.

## భోగాపురం ప్రారంభ తేదీని త్వరలో ప్రకటిస్తాం: కలెక్టర్

ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త కిషోర్ అన్నారు. విశాఖ-భోగాపురం ఎయిర్‌పోర్టు అనుసంధానానికి సంబంధించి 7 రోడ్లలో ఐదింటిని పూర్తి చేసినట్లు చెప్పారు. విశాఖ నుంచి డెడికేటెడ్ ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. ఎయిర్‌పోర్టు కోసం డెడికేటెడ్ బస్ బే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, విశాఖ ఎయిర్‌పోర్టు కొనసాగుతుందనీ, దాని కార్యకలాపాలు మాత్రం భోగాపురం నుంచి నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

## అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి
### అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. మండలంలోని దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్లచెరువు గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ గ్రామాల్లో రూ.16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండా వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వానలు పడుతున్నా అభివృద్ధి పనులు కొనసాగుతాయని.. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, తదితరులు ఉన్నారు.

# 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం ప్రారంభం

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన ఉద్యోగుల ఆరోగ్య పథకంపై ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్టు సమావేశమైంది. జులై 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం ప్రారంభించాలని నిర్ణయించింది. వారం రోజుల్లో ఆస్పత్రుల యాజమాన్యాలతో ట్రస్టు సభ్యులు సమావేశం కానున్నారు. అనంతరం నూతన ఈహెచ్ఎస్ నిబంధనలను ట్రస్టు విడుదల చేయనుంది. భార్యాభర్తల్లో ఎవరైనా ఒకరి నుంచి మాత్రమే చందా తీసుకోవాలని ట్రస్టు నిర్ణయించింది. ప్యాకేజీ రేట్లు, ఆస్పత్రుల జాబితాను వచ్చే సమావేశంలో ఖరారు చేయాలని నిర్ణయించారు.

## స్కూల్ బస్సు కింద పడి బాలుడు మృతి

యాదాద్రి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో విషాదం చోటు చేసుకుంది. స్కూల్ బస్సు కింద పడి రెండున్నరేళ్ల బాలుడు మృతి చెందాడు. పెద్ద కుమారుడిని దింపేందుకు తల్లి స్కూల్ బస్సు దగ్గరికి వెళ్లింది. అన్న కోసం ఆమె వెనకే బాలుడు కూడా వెళ్లాడు. డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు తీసేయడంతో టైరు కింద పడి బాలుడు మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం రైతులు, గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బతీసేలా ఉందని అన్నారు. వీబీజీ రామ్‌జీ పథకంపై తెలంగాణ క్యాబినెట్ సబ్ కమిటీ శనివారం సమావేశమైంది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ హాజరయ్యారు. వీబీజీ రామ్‌జీ పథకం అమలుపై చర్చించారు. పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టాన్ని అంగీకరించం. వీబీజీ రామ్‌జీ చట్టంపై సుప్రీం కోర్టును ఆశ్రయించాలన్న యోచనలో ఉన్నాం. కేరళ, కర్ణాటకలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తాం' అని ఉత్తమ్ వెల్లడించారు.

## హైదరాబాద్‌లో తిష్ట వేసిన రోహింగ్యచాలు వీరిందరిని గుర్తించి పంపాల్సిందే: కిషన్ రెడ్డి

హైదరాబాద్ నగరంలో ఎంతో మంది రోహింగ్యాలు అక్రమంగా నివాసం ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారికి ఇక్కడ ఓట్లు, రేషన్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని ఆక్షేపించారు. వీరందరనిని గుర్తించి వెనక్కి పంపాల్సి ఉందన్నారు. రామ్‌కోఠిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి.. చిన్నారులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. తర్వాత ఖైరతాబాద్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం భాజపా కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. పాతబస్తీలో బీఎల్‌వోలను మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. 'సర్'పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలకు పాల్పడినా సమగ్ర ఓటరు జాబితా సవరణను అడ్డుకోలేరని కిషన్‌రెడ్డి తేల్చి చెప్పారు.

## ఎసిబికి చిక్కిన పంచాయితీ కార్యదర్శి లంచం తీసుకుంటుండగా పట్టివేత

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేశ్‌ను శనివారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమేష్ కథనం మేరకు.. ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన ఓ రైతు తన తండ్రి ఇచ్చిన ఐదు గుంటల స్థలంలో రేకుల గది నిర్మాణానికి, ఇంటి నంబర్ కోసం గత నెల 19న దరఖాస్తు చేసుకున్నాడు. ఇంటి నిర్మాణం అనుమతి, ఇంటి నంబర్ కేటాయించటానికి పంచాయతీ కార్యదర్శి సురేష్.. బాధితుడ్ని రూ .40వేలు లంచం డిమాండ్ చేశారు. అంత నగదు ఇచ్చుకోలేనని రూ .25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం ముదిగొండలోని రైతు వేదిక వద్ద బాధితుడి వద్ద నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా సురేశ్‌ను రెడ్ హ్యాండ్‌డెగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. అనంతరం బాణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న పలు రికార్డులను తనిఖీ చేశామన్నారు.

### యాదగిరిగుట్టలో రద్దీ.. క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

**యాదగిరిగుట్ట:**
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. క్యూ లైన్లో భక్తులు బారులు తీరారు. ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంట సమయం పడుతోంది. ఆర్జిత సేవలు, నిత్యా పూజల్లో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. నిత్య కల్యాణం, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండకింద కల్యాణ కట్ట, పుష్కరిణి, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది.

## అమ్రాబాద్ అడవుల్లో అద్భుతం.. తెలంగాణలో అడుగుపెట్టిన భారతదేశపు అతిపెద్ద రెక్కల సుందరి!



తెలంగాణ అటవీ, జీవ వైవిధ్య సంపదలో మరో అరుదైన జీవి చేరింది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఎక్కడా నమోదు కానీ.. భారతదేశంలోనే అతిపెద్ద సీతాకోక చిలుకలలో ఒకటైన సరదన్ బర్డ్ వింగ్ తొలిసారి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో కనిపించింది. ఈ అరుదైన గుర్తింపు జీవవైవిధ్య పరిరక్షణలో కొత్త అధ్యాయంగా పేర్కోంటున్నారు.
అమ్రాబాద్ అడవుల్లో అద్భుతం.. తెలంగాణలో అడుగుపెట్టిన భారతదేశపు అతిపెద్ద రెక్కల సుందరి!
అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ మరోసారి జీవవైవిధ్య విశిష్టతను చాటుకుంది. దేశంలోనే అతిపెద్ద సీతాకోకచిలుకల్లో ఒకటైన సదరన్ బర్డ్ వింగ్ కొల్లాపూర్ రేంజ్ పరిధిలో దర్శనమిచ్చింది. సాధారణంగా సదరన్ బర్డ్ వింగ్ పశ్చిమ కనుమ ప్రాంతంలోనే కనిపిస్తుంటుంది. తూర్పు కనుమల్లో కొన్ని ప్రాంతాల్లో చాలా అరుదుగా కనిపిస్తుంది. అలాంటి జాతి సీతాకోకచిలుక ఇప్పుడు అమ్రాబాద్ అడవుల్లో నమోదు కావడం ఈ ప్రాంతంలోని శాస్త్రీయంగా, జీవవైవిధ్య పరిరక్షణ పరంగా అత్యంత ప్రాధాన్యను సంతరించుకుంది.
ఈ అరుదైన సీతాకోకచిలుకను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నీలేష్, వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్ డాక్టర్ రవికాంత్ గుర్తించి అధికారికంగా నమోదు చేశారు. ఈ నమోదుతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లోని జీవవైవిధ్యంపై మరిన్ని పరిశోధనలకు మార్గం సుగమం కానుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, ఇతర అడవి జంతువులకు, ఔషధ మొక్కలకు నిలయంగా ఉన్న అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ తాజాగా అరుదైన సీతాకోకచిలుక సదరన్ బర్డ్ వింగ్ నమోదుతో మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది.
సదరన్ బర్డ్ వింగ్ శాస్త్రీయ నామం ఒతీశీఱనవం ఎఱఅశీం. ఈ జాతి సీతాకోకచిలుక నలుపు, పసుపు రంగుల కలయికతో అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. వీటి రెక్కల విస్తీర్ణం 140-190 మిల్లీమీటర్ల వరకు ఉంటుంది. ఇందులో ఆడ సీతాకోకచిలుక పరిమాణంలో మరింత పెద్దగా ఉంటుంది. ఈ అరుదైన సీతాకోకచిలుక ఎత్తైన అడవులు, సతతహరిత అటవీ ప్రాంతాలు, స్వచ్ఛమైన పర్యావరణం ఉన్న ప్రాంతాల్లో జీవిస్తుంది.

## గంగమ్మకు మొక్కి వల వేసిన జాలరి.. కాసేపటికే జిల్ జిల్ జిగేల్!



మల్లాపూర్ మండల కేంద్రం శివారులోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు 15 కిలోల భారీ చేప చిక్కింది. గత రెండు నుంచి మూడు సంవత్సరాలుగా చెరువులో నీటి నిల్వలు అధికంగా ఉండటంతో చేపలు పెద్ద పరిమాణానికి పెరిగినట్లు మత్స్యకారులు తెలిపారు. భారీ చేపను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపగా, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు..

మల్లాపూర్, జూన్ 28 : మల్లాపూర్ మండల కేంద్రం శివారులోని పెద్ద చెరువులో ఆదివారం చేపల వేటకు వెళ్లిన స్థానిక మత్స్యకారులకు భారీ చేప చిక్కింది. ఏకంగా 15 కిలోల బరువున్న చేప వలకు చిక్కడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక గంగపుత్ర మత్స్యకారుల కథనం ప్రకారం..
గత రెండు నుంచి మూడు సంవత్సరాలుగా పెద్ద చెరువులో నీటి నిల్వలు అధికంగా ఉండటంతో చేపల పిల్లలను కొత్తగా వదలలేదని తెలిపారు. దీంతో ఇప్పటికే చెరువులో ఉన్న చేపలు సహజసిద్ధంగా పెరిగి 5 నుంచి 15 కిలోల వరకు బరువు పెరిగినట్లు చెప్పారు. ఆదివారం చేపల వేట కోసం వలలు వేయగా.. ఏకంగా15 కిలోల భారీ చేప చిక్కిందని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఎల్ల ఆశాలు, కార్యదర్శి న్యావనంది నికేశ్ తెలిపారు. భారీ చేపను చూసేందుకు స్థానికులు కూడా ఆసక్తి చూపించారు.
చెరువులో మరిన్ని భారీ చేపలు ఉండే అవకాశం ఉందని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ఇంత పెద్ద చేప చిక్కడం అరుదైన విషయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు న్యావనంది నడిపి నర్సయ్య, ఎల్ల చిన్న దేవయ్య, గంగాధర్, సురేష్, పెద్దిరెడ్డి, గంగారాం, పల్లికొండ నర్సయ్య, లక్ష్మీనారాయణ, నవీన్ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు దొరికిన భారీ చేపను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

## మరొకరితో కోడలు.. ప్రాణాలు తీసుకున్న కొడుకు.. న్యాయం కోసం పోరాడిన తల్లి.. చివరకు

ఎనిమిదేళ్ల క్రితం కొడుకు ఆత్మహత్య కేసులో నిందితులకు శిక్ష పడటంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన తిరుపతమ్మ పోలీసులను ఘనంగా సన్మానించారు. వివాహేతర సంబంధం, మానసిక వేధింపుల కారణంగా కొడుకు ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించిన ఆమె.. న్యాయం కోసం ఏళ్ల తరబడి పోరాడి చివరకు కోర్టు తీర్పుతో ఉపశమనం పొందారు.మరొకరితో కోడలు.. ప్రాణాలు తీసుకున్న కొడుకు.. న్యాయం కోసం పోరాడిన తల్లి.. చివరకు 8 సంవత్సరాల క్రితం కొడుకు ఆత్మహత్య కేసులో కోర్టు తీర్పుతో ఆ తల్లి మనస్సు కుదుటపడింది. దోషులకు ఎట్టకేలకు శిక్ష పడిందంటూ తన సంతోషాన్ని అందరితో పంచుకుంది. ఈ కేసులో విచారణ పూర్తి చేసి నిందితుందరినీ కోర్టు ముందు నిలబెట్టిన పోలీసుల్ని ఘనంగా సన్మానించింది. తన కొడుకు ఆత్మకు ఇప్పటికి శాంతి చేకూరింది అంటూ కన్నీరు పెట్టుకుని భావోద్వేగానికి లోనైంది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో జరిగింది. ఉన్న ఊరిలోనే భార్య వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకోవటంతో భర్త భరించలేకపోయాడు.. వద్దని వారించాడు.. ఆమెలో మార్పులేకపోగా భర్తను మరింత మానసిక వేధింపులకు గురిచేసింది.

## ఆర్మూర్ లో కూడా జీహాది గ్యాంగులు ఉన్నాయా?

# ప్రైవేట్ స్కూల్ లో హిందూ విద్యార్థులకు ఉర్దూ బోధన

**కటకం సాయి, కరపత్రం ప్రతినిధి**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ లోని భరత్ చంద్ర పాఠశాలలో ప్రభుత్వం ఉర్దూ మీడియంను అనుమతించకుండా ఉర్దూ మరియు ఇస్లాం ఆచార వ్యవహారాలను బోధిస్తున్న ముస్లిం ప్రిన్సిపాల్ మరియు ముస్లిం టీచర్.ఈ పాఠశాలకు సంబంధించిన తాజా వివాదం మరియు వాస్తవాలు క్రింది విధంగా ఉన్నాయి. భరత్ చంద్ర పాఠశాల (భవిష్య దర్శిని స్కూల్) అనేది ఆర్మూర్, పెర్కిట్ లోని ఒక ప్రైవేట్ పాఠశాల.ఇది గుర్తింపు పొందిన ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ఇది ప్రభుత్వ పాఠశాల కాదు.

**అనుమతి లేని బోధన**

యాజమాన్యం సొంతంగా ఒక ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించి, ప్రాథమిక తరగతుల ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఉర్దూ భాషను బోధించడం ప్రారంభించింది.దీనికి విద్యాశాఖ నుండి ఎలాంటి అధికారిక అనుమతి లేదు.

**తాజా పరిణామాలు**

హిందూ విద్యార్థులకు నిబంధనలకు విరుద్ధంగా ఉర్దూ, కల్మాలు నేర్పిస్తున్నారంటూ జూన్ 2026 చివరి వారంలో విద్యార్థుల తల్లిదండ్రులు,హిందూ సంఘాలు, స్థానిక బీజేపీ నాయకులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు.
ఈ క్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉర్దూ ఉపాధ్యాయుడిపై దాడి జరిగింది.

**పోలీస్ కేసులు**

ఈ ఘటనపై ఆర్మూర్ పోలీసులు రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్లు (FIRs) నమోదు చేశారు.



పాఠశాలలోకి అక్రమంగా ప్రవేశించి ఉపాధ్యాయులపై దాడి చేసినందుకు బీజేపీ నాయకులపై ఒక కేసు నమోదైంది.
తగిన అనుమతులు లేకుండా ఉర్దూ బోధించి, మతాల మధ్య వైషమ్యాలు పెంచేలా వ్యవహరించినందుకు పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, మరియు ఉర్దూ టీచర్‌పై విద్యాశాఖ (MEO) విచారణ ఆధారంగా మరొక కేసు నమోదైంది.
ప్రభుత్వం ఈ పాఠశాలలో ఉర్దూ మీడియంను ప్రవేశపెట్టలేదని, కేవలం పాఠశాల యాజమాన్యం,ప్రభుత్వ అనుమతి లేకుండా ఉర్దూ క్లాసులు నిర్వహించడం వల్లే ఈ వివాదం తలెత్తిందని విద్యాశాఖ మరియు పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ లోని భరత్ చంద్ర పాఠశాలలో ప్రభుత్వం ఉర్దూ మీడియంను ప్రవేశపెట్టలేదు.ఈ పాఠశాలకు సంబంధించిన తాజా వివాదం మరియు వాస్తవాలు క్రింది విధంగా ఉన్నాయి:పాఠశాల వివరాలు మరియు వివాదం(ప్రైవేట్ పాఠశాల: భరత్ చంద్ర పాఠశాల (భవిష్య దర్శిని స్కూల్) అనేది ఆర్మూర్ (పెర్కిట్) లోని ఒక ప్రైవేట్ గుర్తింపు పొందిన ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ఇది ప్రభుత్వ పాఠశాల కాదు.అనుమతి లేని బోధన: విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు పాఠశాల యాజమాన్యం సొంతంగా ఒక ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించి, ప్రాథమిక తరగతుల ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఉర్దూ భాషను బోధించడం ప్రారంభించింది. దీనికి విద్యాశాఖ నుండి ఎలాంటి అధికారిక అనుమతి లేదు.తాజా పరిణామాలుఆందోళనలు ఽ దాడి: హిందూ విద్యార్థులకు నిబంధనలకు విరుద్ధంగా ఉర్దూ, కల్మాలు నేర్పిస్తున్నారంటూ జూన్ 2026 చివరి వారంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక బీజేపీ నాయకులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉర్దూ ఉపాధ్యాయుడిపై దాడి జరిగింది.పోలీస్ కేసులు: ఈ ఘటనపై ఆర్మూర్ పోలీసులు రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్లు (FIRs) నమోదు చేశారు.పాఠశాలలోకి అక్రమంగా ప్రవేశించి ఉపాధ్యాయులపై దాడి చేసినందుకు బీజేపీ నాయకులపై ఒక కేసు నమోదైంది.తగిన అనుమతులు లేకుండా ఉర్దూ బోధించి, గ్రూపుల మధ్య వైషమ్యాలు పెంచేలా వ్యవహరించినందుకు పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, మరియు ఉర్దూ టీచర్‌పై విద్యాశాఖ (MEO) విచారణ ఆధారంగా మరొక కేసు నమోదైంది.ప్రభుత్వం ఈ పాఠశాలలో ఉర్దూ మీడియంను ప్రవేశపెట్టలేదని, కేవలం పాఠశాల యాజమాన్యం అనుమతి లేకుండా ఉర్దూ క్లాసులు నిర్వహించడం వల్లే ఈ వివాదం తలెత్తిందని విద్యాశాఖ మరియు పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

## పిల్లలకు పోలియో చుక్కలు వేసిన

# మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ నియోజకవర్గం మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్న పిల్లలకు మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే శ్రీ చామకూరి మల్లారెడ్డి పోలియో చుక్కలు పోలియో చుక్కలు వేశారు.

పోలియో అనేది చిన్న పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేసే ప్రమాదకరమైన వ్యాధి.
పోలియో ఒకసారి సోకితే జీవితాంతం ఉంటుంది.
పోలియో వ్యాధి వికలాంగత్వానికి దారి తీస్తుంది.

- **దురదృష్టవశాత్తు,దీనికి పూర్తి చికిత్స లేదు. కానీ నివారణ మాత్రం ఖచ్చితంగా ఉంది. అదే పోలియో**



**చుక్కలు.**

ఇది 0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి, ప్రతి పల్స్ పోలియో రౌండ్‌లో పోలియో చుక్కలు వేయించడం చాలా అవసరం.

ఇప్పటికే వేసినా, మళ్లీ వేయించాలి. ఇది పూర్తిగా సురక్షితం, ఉచితం.
ఈ సందర్భంగా తల్లిదండ్రులందరూ గుర్తుంచుకుని తమ పసి పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి.
ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా, పనికిరాని ఏ విషయాలు నమ్మకుండా, మీ పిల్లల భవిష్యత్తు కోసం తప్పకుండా పోలియో చుక్కలు వేయించండి అని ఈ సందర్భంగా మల్లారెడ్డి గారు అన్నారు.

## మహిళని డి కొట్టి పరరైనా కంటైనర్‌ను వెంబడించి పట్టుకున్న యువకులు:

- **రిపోర్టర్ చిక్కుడు మహేష్, బోయిని రాజులకు ఎస్సై ఘన సన్మానం**

**కరపత్రం ప్రతినిధి చేగుంట, జూన్ 28:**
మెదక్ జిల్లా, చేగుంట జాతీయ రహదారి (ఎన్ ఎచ్ 44) పై శనివారం మధ్యాహ్నం కర్నే మంజుల అనే మహిళను ఢీకొట్టి ఆపకుండా అతివేగంగా పారిపోతున్న కంటైనర్ లారీని తమ ప్రాణాలకు తెగించి వెంబడించి పట్టుకున్న రిపోర్టర్ చిక్కుడు మహేష్, బోయిని రాజుల ధైర్యసాహసాలను చేగుంట పోలీసులు అభినందించారు. ప్రమాదం జరిగిన వెంటనే కంటైనర్ ఆపకుండా వెళ్ళిపోతుండగా, అటుగా వెళ్తున్న చిక్కుడు మహేష్,



బోయిని రాజులు సమయస్ఫూర్తితో స్పందించి తమ ద్విచక్ర వాహనంపై ఆ వాహనాన్ని చాకచక్యంగా వెంబడించారు. లారీని అడ్డుకొని డ్రైవర్‌ను పట్టుకున్న యువకులు, వెంటనే పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆదివారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్సై జి. చైతన్య కుమార్ రెడ్డి సదరు యువకుల సాహసాన్ని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. సమాజంలో ప్రమాదాలు జరిగినప్పుడు ఇలాంటి ధైర్యవంతులైన యువకుల ఆవశ్యకత ఎంతైనా ఉందని కొనియాడుతూ ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి వారిద్దరినీ శాలువాతో ఘనంగా సన్మానించార. ఈ కార్యక్రమంలో చేగుంట పోలీస్ సిబ్బంది, మీడియా మిత్రులు మొజమిల్, కొండి శ్రీనివాస్, మధు, చౌదరి శ్రీనివాస్, స్టాలిన్ నర్సింలు, శబ్బని శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేటలో పల్స్ పోలియో సక్సెస్

- **నిండు జీవితానికి రెండు చుక్కలు మిండా**
- **పల్స్ పోలియో ఎంతో కీలకం హరిబాబు**
- **చిన్నారుల కోసం ఓపికతో వైద్య సిబ్బంది కృషి**
- **పదవ వార్డులో చిన్నారులంతా హాజరు**
- **ఏ.ఎస్.ఆర్ కాలనీలో మిండా ను అభినందించిన స్థానికులు**

**కొత్తగూడెం జూన్ 28 కరపత్రం ప్రతినిధి**
నూతనంగా మున్సిపాలిటీ ఏర్పడి పదవ వార్డులో ఘన విజయం సాధించిన మిండా హరిబాబు ఏ ఎస్ ఆర్ కాలనీలో ఆదివారం రోజున విజయవంతంగా ప్రోత్సహించారు, ముందుగా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డు కౌన్సిలర్ మిండా హరిబాబు గౌరవప్రదంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు,
తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రత్యేకంగా వైద్య సిబ్బంది జ్యోతి,



విష్ణు, శాంత కుమారి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి పోలియో డ్రాప్స్ ను రోజంతా కొనసాగించారు,

**వైద్య సిబ్బంది ప్రత్యేక అవగాహన**

స్థానికంగా ఏఎస్ఆర్ కాలనీలో చిన్నారులు తల్లిదండ్రులకు, ప్రతి ఒక్క కుటుంబానికి పల్స్ పోలియో గురించి ఇంటింటికి పరిశీలించి పూర్తి అవగాహన వైద్య సిబ్బంది కల్పించారు, ఓర్పు తోటి ప్రతి ఒక్క చిన్నారికి పల్స్ పోలియో వేశారు,

**మిండా హరిబాబు ఏ ఎస్ ఆర్ లో ప్రధాన కీలకం**

స్థానికుల అభిమానాన్నే కాదు ఆదివారం రోజున జరిగిన పల్స్ పోలియో కార్యక్రమానికి ముఖ్యఅతిథి కావచ్చు కానీ స్థాన స్థానిక ప్రదేశంలో తల్లిదండ్రులకు అవగాహన కలిగించి, ప్రతి ఒక్క చిన్నారిని తన బిడ్డలా భావించి తనే స్వయంగా పోలియో చుక్కలు వేసి చిన్నారుల మనసును కూడా ప్రస్తుతం గెలుచుకున్నాడు,
ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు కచ్చితంగా పల్స్ పోలియో చుక్కలను వేయించుకోవాలని, చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు ప్రధమమని పదవ వార్డు ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించారు, అనంతరం చిన్నారులతో కలిసి కొంతసేపు సరదాగా కాలక్షేపం చేశారు, పోలియో చుక్కలు వేసిన తర్వాత ప్రతి ఒక్క చిన్నారి మిండా హరిబాబుకు టాటా బాయ్ బాయ్ అంటూ వెళ్లారు, ఆ ప్రేమ ఆత్మీయతలకు మంత్రముగ్దుడై మిండా హరిబాబు ముసి ముసి నవ్వులు నవ్వాడు, ఈ కార్యక్రమానికి వైద్య సిబ్బంది జ్యోతి, విష్ణు, శాంత కుమారి, స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది, స్థానికులు, తల్లిదండ్రులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం:

- **చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఉప సర్పంచ్ చిక్కుడు స్వామి**

**కరపత్రం ప్రతినిధి జూన్ 28:**





మెదక్ జిల్లా, చేగుంట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతసాగర్ గ్రామ ఉప సర్పంచ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, చిన్నారులకు తమ చేతుల మీదుగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా తమ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. “ప్రతిసారి రెండు చుక్కలు – పోలియోపై నిరంతరంగా విజయం” అనే నినాదంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ పీహెచ్ నార్సింగి భాగ్య అంగన్వాడీ టీచర్ చంద్రకళ ఆశ వర్కర్ శ్యామల వార్డ్ సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు చుక్కల మందు..
## పోలియోకు శాశ్వత బంధు..!

- **పరిగి మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు కమల్**

**కరపత్రం ప్రతినిధి పరిగి**
జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న పరిగి మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు కమల్.ఆదివారం హనుమాన్ గండి అంగన్వాడి సెంటర్ లో,నజీరాబాద్ పాఠశాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు కమల్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## 13వ వార్డు బీసీ కాలనీలో అయ్యప్ప స్వామి ఆహ్వాన కరపత్రాల పంపిణీ



**కరపత్రం ప్రతినిధి పరిగి**
పరిగి పట్టణ 13వ వార్డు బీసీ కాలనీలో సంతోష్ స్వామి (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో బీసీ కాలనీ యువత అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను ప్రతి ఇంటికి పంపిణీ చేసే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.
స్వామియే శరణం అయ్యప్ప అనే నామస్మరణలతో యువత ఇంటింటికి వెళ్లి రానున్న మహోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొని అయ్యప్ప స్వామివారి ఆశీస్సులు పొందాలని భక్తులను ఆహ్వానించారు.
ఈ కార్యక్రమం ద్వారా యువత ఐకమత్యం, సేవాభావం, ఆధ్యాత్మిక చైతన్యం ప్రతిబింబిస్తాయని అన్నారు.అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరుకావాలని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

## పోలియో రహిత సమాజ నిర్మాణానికి చిన్నారులకు పోలియో చుక్కలు

**చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్**



**కరపత్రం ప్రతినిధి చౌడాపూర్**
పోలియో రహిత సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరూ లక్ష్యంగా ఉండాలని చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి, వారి ఆరోగ్యకరమైన భవిష్యత్ కు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ప్రతి ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా పోలియో చుక్కలు వేయించుకొని ఆరోగ్యాకరమైన గ్రామంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. చెన్నయ్య, గాజుల చంద్రశేఖర్,యువజన నాయకులు బొక్క చెన్నయ్య, గొడుగు బాలరాజు,శేరి శ్రీనివాసులు,ఆశ కార్యర్త పార్వతీమ్మ,అంగన్వాడీ కార్యకర్త రాములమ్మ, బొల్ల కేశవులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలియో నిర్మూలనే లక్ష్యం.. ప్రతి చిన్నారికి రెండు చుక్కలు తప్పనిసరి



9వ వార్డు కౌన్సిలర్ రామతీర్థపు మాధవి-రాజు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

పోలియో నిర్మూలనే లక్ష్యంగా ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని 9వ వార్డు కౌన్సిలర్ రామతీర్థపు మాధవి-రాజు పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సుభాష్ నగర్‌లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ను ఆమె సందర్శించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సృజన, ఆశా వర్కర్ దమ్మ లతతో పాటు స్థానికులు పాల్గొన్నారు.ద

# ఇల్లందకుంటలో సీఎం, మంత్రులు, ప్రణవ్ చిత్రపటాలకు పాలాభిషేకం

నూతన తహశీల్దార్ కార్యాలయ భవనానికి నిధుల మంజూరుపై కాంగ్రెస్ నాయకుల హర్షం

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూన్ 28:**

ఇల్లందకుంట మండల కేంద్రంలో నూతన తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ఇల్లందకుంట మండలానికి సొంత తహశీల్దార్ కార్యాలయ భవనం అవసరాన్ని గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో వొడితల ప్రణవ్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సంబంధిత మంత్రులతో పలుమార్లు చర్చించి, సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతోనే నిధుల మంజూరు సాధ్యమైందన్నారు.తెలంగాణలో గత పదేళ్ల





బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కంటే నిర్లక్ష్యమే ఎక్కువగా కనిపించిందని విమర్శించారు. జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణ జరిగినప్పటికీ నూతన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇల్లందకుంట ప్రాంతం మీదుగా పలుమార్లు పర్యటించినప్పటికీ స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ పునర్నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వొడితల ప్రణవ్ నిరంతరం మంత్రులతో సంప్రదింపులు జరుపుతూ నిధులు తీసుకువస్తున్నారని కొనియాడారు.ఇల్లందకుంట ప్రజల దీర్ఘకాల కోరిక అయిన తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం అభివృద్ధి దిశగా కీలక అడుగని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు



ఎన్యూమరేషన్ ఫారాలపై కార్యకర్తలకు అవగాహన

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 28:**

బీజేపీ పార్టీ సిరిసేడు, పాతర్లపల్లి, భోగంపాడ్ గ్రామాల శక్తి కేంద్రం ఇంచార్జి అబ్బిడి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎం.డి. షఫీ నివాసంలో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని మండల నాయకులు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ-2 ప్రతినిధులు కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశాభివృద్ధి, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధన వంటి అంశాలపై చేసిన ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించారు. అనంతరం గ్రామాల్లో బీఎల్ఓలు ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలపై బీజేపీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు.ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ప్రజలకు అందించాల్సిన అవగాహన, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు చర్చించారు. ప్రతి ఇంటికి చేరుకుని ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అబ్బిడి తిరుపతి రెడ్డి, జిల్లా మైనార్టీ మోర్చా నాయకులు ఎం.డి. షఫీ, మండల ఉపాధ్యక్షులు సామ కరుణాకర్ రెడ్డి, చింతల ఐలయ్య, ఉప్పు దుర్గయ్య, బూత్ అధ్యక్షులు జోడు సంపత్, గురుకుంట్ల సంజీవ్, వడ్లకొండ జలపతి, చల్లూరి కుమార్, కోడం నవీన్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు -- పోలియో రహిత భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

జమ్మికుంట 10వ వార్డులో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 28:**

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, పోలియో వంటి ప్రమాదకర వ్యాధుల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని జమ్మికుంట మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ అన్నారు. ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 10వ వార్డులోని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, ఒకప్పుడు దేశవ్యాప్తంగా వేలాది మంది చిన్నారులను వికలాంగులుగా మార్చిన పోలియో వ్యాధిని సమిష్టి కృషితో నిర్మూలించగలిగామని, అయితే వ్యాధి తిరిగి ప్రబలకుండా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చిన్నారుల



ఆరోగ్యం అత్యంత కీలకమని, అందుకే ప్రతి తల్లిదండ్రులు పల్స్ పోలియో కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు."నిండు జీవితానికి రెండు చుక్కలు" అనే నినాదంతో ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం భవిష్యత్ తరాల ఆరోగ్య భద్రతకు బలమైన పునాది వేస్తోందన్నారు. ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. చిన్నారుల భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోలియో రహిత భారతదేశాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు ప్రజలందరూ ఆరోగ్య శాఖకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వార్డు ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా పోలియో నివారణ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.చివరగా కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కలిసి ముందుకు రావాలని కోరారు.

# శ్రీ వినాయక రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు.



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**

రామడుగు మండలం వెదిర గ్రామ శ్రీ వినాయక రెడ్డి సంక్షేమ సంఘం నూతన పాలకవర్గాన్ని సంఘం సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం భవనంలో నిర్వహించిన ఎన్నికలలో అధ్యక్షులుగా వంగల సంతోష్ రెడ్డి ,గౌరవాధ్యక్షులుగా వంచ రాజిరెడ్డి ,ఉపాధ్యక్షులుగా వంచ రాంగోపాల్ రెడ్డి, రాళ్ల బండి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోతి శ్రీనివాస్ రెడ్డి ,సంయుక్త కార్యదర్శిగా ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, రాళ్ల బండి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా రాళ్ల బండి ,చంద్రశేఖర్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా వంచ మధు రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వంగల రమణారెడ్డి, రాళ్ల బండి తిరుపతిరెడ్డి, కురుకండ్ల లచ్చిరెడ్డి ,మావురం వెంకటరెడ్డి ,వంచ హనుమంత రెడ్డి, వంచ అంజిరెడ్డి ,వంగల రాంగోపాల్ రెడ్డి లతోపాటు పలువురిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించారు. కరీంనగర్ ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బిరెడ్డి ప్రేమ్ సాగర్ రెడ్డి లతోపాటు పలువురు రెడ్డి సంఘానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగులను సంఘం పెద్దలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జిల్లా తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు వంచ సుదర్శన్ రెడ్డి, రాళ్ల బండి గోపాల్ రెడ్డి, రాళ్ల బండి వెంకటరెడ్డి, వంచ కిష్టారెడ్డి, రాళ్ల బండి శ్రీనివాస్ రెడ్డి, వంగల భూమి రెడ్డి లతోపాటుగా పలువురు పాల్గొన్నారు.

# భారత రత్న పి.వి. నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

దేశ ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన మహానేతకు నివాళులు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూన్ 28:**

భారత రత్న, మాజీ ప్రధానమంత్రి, తెలంగాణ ముద్దుబిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావు జయంతి సందర్భంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి. నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి ధైర్యవంతమైన నిర్ణయాలతో భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహానేత పి.వి. నరసింహారావు అని కొనియాడారు. 1991 నుంచి 1996 వరకు ప్రధానమంత్రిగా పనిచేస్తూ ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి భారతదేశాన్ని ప్రపంచ



ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానానికి చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.పి.వి. నరసింహారావు కేవలం రాజకీయ నాయకుడే కాకుండా బహుభాషా కోవిదుడు, గొప్ప రచయిత, దూరదృష్టి కలిగిన మేధావి అని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై జన్మించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన ఆయన జీవితం యువతకు ఆదర్శప్రాయమని తెలిపారు. దేశాభివృద్ధికి, ప్రజాస్వామ్య బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఆయన ఆలోచనలు, పరిపాలనా విధానం, సంస్కరణల దిశగా తీసుకున్న నిర్ణయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని నాయకులు పేర్కొన్నారు. దేశాన్ని ఆధునిక ఆర్థిక వ్యవస్థ వైపు మలిచిన మహోన్నత వ్యక్తిగా పి.వి. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల తిరుపతి, మార్కెట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది శివకుమార్, గూడెపు సారంగపాణి, కనుమల్ల సంపత్, కళ్లెం సత్యనారాయణ రెడ్డి, బొమ్మ శ్రీనివాస్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, మీసా రాజయ్య, మూడెడ్ల రమేష్, తోడేటి కిషన్, బండి మల్లయ్య, జిల్లెల్ల సందీప్ రెడ్డి, గోరుకుంట్ల స్వామి, మహిపాల్ యాదవ్, కొట్టే శేఖర్, గూడెపు ఓదెలు, దంసాని తిరుపతి, జక్కు కుమార్, రేణిగుంట రవీందర్, సరికొమ్ముల సదానందం, రావుల రాజబాబు, భోగం చిరంజీవి, జిల్లెల్ల తిరుపతిరెడ్డి, ఉప్పుల మల్లారెడ్డి, దాసరి తిరుపతిరెడ్డి, కందాల దయాకర్, కందాల ఎల్లయ్య, నల్లగొండ వీరన్న, బోయిన విష్ణు, బూర్గుల రాజు, ధార మొగిలి, శనగరపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్ కార్యాలయ భవనానికి నిధుల మంజూరు

సీఎం రేవంత్ రెడ్డి, ప్రణవ్ బాబుకు దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు కృతజ్ఞతలు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూన్ 28:**

ఇల్లంతకుంట మండల నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2016లో ఇల్లంతకుంట మండలం ఏర్పాటైనప్పటికీ, ఇప్పటివరకు తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన కళ్యాణ మండపంలో తహసీల్దార్ కార్యాలయం



కొనసాగుతుండగా, పోలీస్ స్టేషన్ తిరుమల తిరుపతి దేవస్థానం గెస్ట్ హౌస్‌లో కొనసాగుతోందని తెలిపారు.ఇల్లంతకుంట మండల ప్రజల సమస్యలను గుర్తించి, నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు కీలక పాత్ర పోషించారని రామారావు కొనియాడారు. ఇందుకు గాను ఇల్లంతకుంట మండలంలోని 18 గ్రామాల ప్రజల తరఫున, అలాగే కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 107 నూతన తహసీల్దార్ భవనాలు, 10 ఆర్డీవో కార్యాలయాల మంజూరుకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు గొడిశాల పరమేష్, గోలి కిరణ్, కాంగ్రెస్ నాయకులు మారపల్లి సాగర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.